# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 16-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **తెలంగాణలోని గ్రామాలు, పురపాలక సంఘాల్లో వీధి దీపాలపై పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

3. **తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మారిషస్ ప్రధానమంత్రి నవీన్ చంద్ర రామ్‌గూళం దర్శించుకున్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ కు 41 వేల 170 మెట్రిక్ టన్నుల యూరియా వివిధ పోర్టుల ద్వారా చేరుకోనుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.**

5. **అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పలు అంశాలపై ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు చర్యలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్..36 సెకన్లు

కాగా ఈ రోజు జరిగే కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి పలు అంశాలపై వారికి దిశానిర్దేశం చేయనున్నారు.

--------------------------

తెలంగాణలో గ్రామాలు, పురపాలక సంఘాల్లో వీధి దీపాలపై పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వీధిదీపాల పనితీరుపై హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ బాధ్యతలను గ్రామాల్లోని పంచాయతీలకు అప్పగించాలని సూచించారు. లైట్ల పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉండాలని ఇందుకోసం

కృత్రిమమేధను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మారిషస్ ప్రధానమంత్రి నవీన్ చంద్ర రామ్‌గూళం గత సాయంత్రం దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయ మహాద్వారం వద్ద ప్రధాని దంపతులకు తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు, కార్యనిర్వహణాధికారి ఏకే సింఘాల్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపం వద్ద వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

---------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కొన్ని వస్తువుల జీఎస్టీ శ్లాబ్‌లను సవరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. జీఎస్టీ మార్పుల ద్వారా వ్యవసాయ, విద్యా రంగాలకు మేలు చేకూరుతుందని పశ్చిమ గోదావరి జిల్లా వాసి ఆకాశవాణికి తెలియజేస్తూ,

వాయిస్ ..22 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు 41 వేల 170 మెట్రిక్ టన్నుల యూరియా వివిధ పోర్టుల ద్వారా చేరుకోనుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాలకు యూరియాను కేటాయించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేటాయింపుతో రైతులకు వెసులుబాటు లభిస్తుందని, ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం అన్ని విధాల కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. సేవా పర్వ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు అంశాలపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. 'నమామి గంగే' కార్యక్రమం ద్వారా పవిత్ర గంగానదిని ప్రభుత్వం పరిశుభ్రంగా ఎలా మారుస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01 : 19)

---------------------------

ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ విడుదల చేసిన డీఎస్సీ తుది జాబితాకు ఎంపికైన అభ్యర్థులందరికీ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులుగా కొత్త ప్రయాణాన్ని ఆరంభించి భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దాలని పేర్కొంటూ ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ఇది కేవలం ఎంపిక మాత్రమే కాదని ఆంధ్రప్రదేశ్ విద్యా భవిష్యత్తుకు ఒక కొత్త అధ్యాయం అని అన్నారు. అవకాశం రాని అభ్యర్థులు మరింత కృషితో, ప్రేరణతో ముందుకు సాగాలని కేంద్ర మంత్రి సూచించారు.

---------------------------

ఈ రోజు అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నారు, సూర్యుని నుండి వెలువడే అతి నీల లోహిత కిరణాలు భూమిని నేరుగా తాకితే... సమస్త జీవరాశి మనుగడకే పెనుముప్పు వాటిల్లుతుంది. అంత ప్రమాదం జరగకుండా... సూర్యుని అతినీల లోహిత కిరణాలు మనపై నేరుగా ప్రసరించకుండా సూర్యునికి, మనకి మధ్యలో వున్న ఓజోన్ పొర మనలను కాపాడుతోంది. ప్రస్తుతం... ఈ ఓజోన్ పొర క్షీణిస్తోందని పర్యావరణ శాస్త్ర వేత్తలు గుర్తించారు. ఓజోన్ పొరను పరిరక్షించే ఉద్దేశ్యంతో 1987 సెప్టెంబర్ 16న ప్రపంచ దేశాల మధ్య కెనడాలోని మాంట్రియల్లో ఒక ఒప్పందం కుదిరింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 16ను ఓజోన్ పరిరక్షణ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మను ఫైబర్‌నెట్ ఎండీగా, ఏలూరు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డిని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవోగా నియమించింది. మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ఎండీగా పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానం దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ నైరుతి గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజశారు.

వాయిస్..26 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================